క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో తలుపులమ్మతల్లి పండగ



తలుపులమ్మతల్లికి పూజలు చేస్తున్న మహిళలు

కోటవురట్ల : పాత తంగేడు గ్రామంలో తలుపులమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారున ఉన్న అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువకులు ఆలయం వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. మొక్కులు చెల్లించుకుని తలనీలాలు సమర్పించుకున్నారు.

ఖాజీపాలెంలో ఉపాధి పనులు ప్రారంభించాలి



ఖాజీపాలెంలో ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్.రాము

అచ్యుతాపురం : మండలంలోని ఖాజీపాలెంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రాము పేర్కొన్నారు. గురువారం ఆయన ఖాజీపాలెంలో ఉపాధి హామీ కూలీలనుద్దేశించి మాట్లాడుతూ గ్రామంలో అర్ధంతరంగా నిలిపివేయడం అన్యాయం అన్నారు. తక్షణమే గ్రామంలో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తారెత్తించిన టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర భారీగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉన్న టమాటా, ఈ వారం రూ.60కి పెరిగింది. ఉల్లిపాయ రూ.25 నుంచి రూ.30, బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగాయి. బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, బీరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న స్థానిక గీతా ఆస్పత్రిలో ఉచిత ఎముకల పరీక్షలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివరావులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్లు పైబడి, దీర్ఘకాలిక నడుంనొప్పి, కీళ్ల నొప్పులు, ఎముకలు తరుచుగా విరుగుట, మెనోపాజ్ వయసు దాటిన మహిళలు తదితర సమస్యలున్న వారి కోసం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

మాడుగుల రూరల్: జంపెనలో వాసవీమాత ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కింతలి - గాదిరాయి వాసవీ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి ఉదయం కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. మాడుగుల నియోజకవర్గంలో ఆర్యవైశ్యులు హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం



విలేకరులతో మాట్లాడుతున్న వీసం, నాయకులు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, తామంతా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ భరోసా ఇచ్చారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. 2019లో ప్రజలు మన పార్టీకి ఐదేళ్ల అధికార మిచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చినవి, ఇవ్వని హామీలు కూడా నెరవేర్చి పలు సంక్షేమ పథకాలు అమలు చేసామన్నారు. పార్టీలు, కులమతాలకతీతంగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాల వల్ల అన్ని వర్గాల వారు, అన్ని పార్టీల వారు లబ్ధి పొందారన్నారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రజలు ఇంకా ఎక్కువ ఆశించి మార్పు కోరుకున్నారన్నారు. కూటమికి అవకాశం ఇచ్చారన్నారు. ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. ఓటమి చెందామని కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమేరకు నెరవేరుస్తుందో చూడాలన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చూసి ఈ నియోజకవర్గంలో కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అటువంటి సంస్కృతి ఈ నియోజకవర్గానికి లేదన్నారు. అటువంటి పరిస్థితులు కొనసాగిస్తే దీటుగా ఎదుర్కొడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికలపుడే రాజకీయాలని తర్వాత అందరూ స్నేహ పూర్వకంగా ఎవరి ప్రభుత్వ పనితీరును వారు పొగుడుకోవడం సహజమన్నారు. వైఎస్సార్‌సీపీకి పోరాటాలు కొత్త కాదన్నారు. 2009లో పార్టీ స్థాపించిన తర్వాత 2019 వరకు పదేళ్ల పాటు ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. అలాగే 2019లో అధికారం చేజిక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. ఈ దఫా ఎన్నికల్లో చంద్రబాబు పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీల పట్ల ప్రజలు మొగ్గు చూపించారన్నారు. ఐదేళ్లు ఓపిక పడితే మళ్లీ 2029లో ఎన్నికలను దీటుగా ఎదుర్కోవచ్చన్నారు. ఈలోగా తమ పార్టీ ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని లోపాలను సరిదిద్దుకుందామని సూచించారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారని, ఆయన ఇచ్చిన హామీలకు ఏటా రూ.1.20 లక్షల కోట్లు బడ్జెట్ అవసరమవుతుందన్నారు. రాష్ట్రం మరో శ్రీలంకగా మారకుండా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జూలై ఒకటో తేదీన లబ్ధిదారులకు రూ.7వేలు పింఛను అలాగే వికలాంగులకు రూ.10 వేలు, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం విడుదల చేయాల్సి ఉందని, పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయని తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున విడుదల చేయాల్సి ఉందని, పద్దెనిమిదేళ్లు నిండిన మహిళందరికీ జూలై నుంచే ఆడబిడ్డ నిధి రూ.1500 చొప్పున విడుదల చేయాల్సి ఉందని, నిరుద్యోగులకు జూలై నుంచే నిరుద్యోగ భృతి రూ. 3 వేలు చొప్పున విడుదల చేయాలని కోరారు. వీటన్నింటికి కోసం ఆయా లబ్ధిదారులు ఎదురు చూడాలని సూచించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి..



కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలకు పల్లెల్లో పారిశుధ్యం లోపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్, క్లీనింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఓటీఎస్ పెండింగ్ చలానాలపై దృష్టి పెట్టి పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపునకు సత్కారం



యలమంచిలి ఎమ్మెల్యేగా గెలుపొందిన విజయకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన సుందరపు విజయకుమార్‌ను గురువారం మునగపాక మండల జనసేన నేతలు ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యలమంచిలి నుంచి కూటమి అభ్యర్థిగా సుందరపు విజయకుమార్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో విజయకుమార్‌ను పలువురు నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, మునగపాక వార్డు సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు సుందరపు విజయకుమార్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ముగిసిన వేసవి శిక్షణ



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



దిమిలి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం ముగిసింది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు లైబ్రేరియన్ ఎస్. శకుంతల అన్నారు. నీతికథలు, పుస్తకపఠనం, కోలాటాలు, పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కాగా వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా పలు అంశాలతో పాటు పలు ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం సాధించాలి



ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ బాబూరావు

అచ్యుతాపురం : ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం సాధించాలని రిసోర్స్ పర్సన్ కె.బాబూరావు అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇంగ్లిష్ అంశంపై పలు సూచనలు ఇచ్చారు. ఇంగ్లిష్‌పై పిల్లలకు ఉన్న అవగాహనను తెలుసుకొన్నారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్రలేఖనం ద్వారా మానసిక వికాసం

మునగపాక : చిత్రలేఖనం ద్వారా మానసిక వికాసం పెరుగుతుందని సీఆర్పీ బొడ్డేడ అచ్చుతకృష్ణ అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అలాగే ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు చంద్ర



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ నేత చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర చిత్రపటానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన జమీందారీ కుటుంబంలో జన్మించిన చంద్ర, తన వందల ఎకరాల భూముల్ని పేదలకు ఉచితంగా పంచి పెట్టిన త్యాగశీలి అని కొనియాడారు. పేదల పక్షాన నిలిచి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారన్నారు. పేదల పక్షాన పోరాటం చేయడమే సీపీఐ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, పోతురాజు, రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నిర్మాణాత్మక అభ్యసనకు కృషి



డీఆర్‌పీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఏఎంవో పట్నాయక్

కశింకోట: బాల బాలికల్లో నిర్మాణాత్మక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని జిల్లా ఏఎంవో ఎం.ఎం.పట్నాయక్ కోరారు. కశింకోటలోని డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో డీఆర్‌పీలకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతుల బాలలు పరిపూర్ణ విద్యా వృద్ధి సాధించేందుకు నూతన బోధనా పద్ధతులను, మూల్యాంకన విధానాలను ఉపాధ్యాయులు అలవర్చుకుని, పాఠశాలల్లో అమలు పరచాలన్నారు. ఈ శిక్షణను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, డైట్ లెక్చరర్ మాధవి, ఎంఈవోలు కె.చిట్టిబాబు, కేఎస్ఎన్ మూర్తి, డి.వేణుగోపాలరావు(మునగపాక), రిసోర్స్ పర్సన్లు కె.ఉమామహేశ్వరరావు, కె.నానాజీ, సీహెచ్ఎన్ దొర, కేవీఎల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సముదాయం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో చేరగోరే విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ కోర్సులో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ జువాలజీలో ఆనర్స్ కోర్సు 40 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో 40 సీట్లు, బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఓఏఎండీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పై కోర్సులకు సంబంధించి అర్హులైన ఫ్యాకల్టీ, అన్ని సదుపాయాలు ఉన్నాయని, చక్కని విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలో చేరాల్సిందిగా కోరారు. డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 14 నుంచి నాల్గో సెమిస్టర్ పరీక్షలు, మధ్యాహ్న సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్

మునగపాక : మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పలువురు దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం రాత్రి మునగపాక మండల జనసేన అధ్యక్షుడు, మునగపాక ఎంపీటీసీ మాజీ సభ్యుడు టెక్కలి పరశురామ్ తన కుటుంబ సభ్యుల పేరిట రూ.20,116 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గాంధీతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నేస్తాలమ్మ పండగ



పండగ పూజలందుకున్న నేస్తాలమ్మతల్లి

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో శ్రీ నేస్తాలమ్మతల్లి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ అమ్మవారికి వేకువ జామునుంచి దర్శించుకునేందుకు పోటీ పడ్డారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించగా రైతులు వారి వారి వ్యవసాయ పనులు సక్రమంగా జరగాలని మొక్కుకున్నారు. తొలకరి ముందుగా ఈ అమ్మవారి జాతర నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే శుభసూచికంగా వారి నమ్మకంగా ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

నూకాంబికకు చీరల అలంకరణ



చీరలతో భక్తులకు దర్శనం ఇస్తున్న తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని అమావాస్య పురస్కరించుకుని భక్తులు సమర్పించిన 101 చీరలతో గురువారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



రోలుగుంటలో సిబ్బందితో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట: మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొవ్వూరులో హెల్త్ సూపర్‌వైజర్ వరహాలమ్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శి గొర్లి వరలక్ష్మి, తదితరులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో దోమలను అరికడదాం-మలేరియా నుంచి విముక్తి పొందుదాం, దోమ తెరలు వాడండి.. దోమల నుంచి రక్షణ పొందాలి అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల ద్వారా సంభవించే మలేరియా జ్వరంతోపాటు డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర రోగాలు గురించి తెలియజేశారు. మన వాడే నీటి పాత్రలు, వంటకాలపై విధిగా మూతలు పెట్టి భద్రపరచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఒ.టి.ఎస్. నగదు చెల్లింపు వివరాలు ప్రభుత్వానికి పంపించాలన్నారు. వర్షాకాలం ప్రారంభం అయిన కారణంగా పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : పట్టణంలో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు, యలమంచిలి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఫీడర్ నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. పట్టణంలో కొత్తపేట, మిలట్రీ కాలనీ, యానాద్రికాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, మధురానగర్, నాగేంద్ర కాలనీ, కోర్టుపేట, భవనం వీధి, గాంధీనగరం, ద్వారకానగర్, నెహ్రూ నగర్, శేషుగెడ్డ శివాలయం వీధి ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణంలో 33/11 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (శుక్రవారం) పాయకరావుపేట, పి.ఎల్ పురం, నామవరం, సీతారాంపురం గ్రామాల పరిధిలో విద్యుత్‌కు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఎండ తీవ్రతకు వెలవెలబోయిన సంత



వేసవి ఎండతో కొనుగోలుదారులు లేక బోసిపోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత వేసవి తాపానికి గురువారం వెలవెలబోయింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో కొనుగోలుదారుల తాకిడి తగ్గింది. దీంతో కూరగాయలు, పండ్లు, మసాల దినుసులు, వస్త్రాలు తదితర వస్తువులు విక్రయించే వ్యాపారులు కూడా అధిక వేడిని భరించలేక సమీపంలోని ఇళ్లు, దుకాణాల నీడన చేరారు. దీంతో దుకాణాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 3.30 నుంచి ఎండ తీవ్రత తగ్గడంతో యథావిధిగా అమ్మకాలు సాగాయి.

పింఛన్ సొమ్ము కోసం తప్పని కష్టాలు

బ్యాంక్‌ల వద్ద గంటల కొద్దీ అవ్వాతాతల పడిగాపులు



దేవరాపల్లి ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద పింఛన్ సొమ్ము కోసం నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

దేవరాపల్లి: ప్రతి నెలా వలంటీర్ ద్వారా అందించిన అవ్వాతాతల పింఛన్ సొమ్మును ఈ నెల కూడా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో వారంతా నానా అవస్థలు పడుతున్నారు. పింఛన్ సొమ్ము కోసం బ్యాంక్‌ల వద్ద గంటల కొద్దీ నిరీక్షణ చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బీసీ పాయింట్, యూకో బ్యాంక్‌లతోపాటు వివిధ బ్యాంక్‌ల బీసీ పాయింట్‌ల వద్ద అవ్వాతాతలు పడిగాపులు కాశారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సుదూర గ్రామాల నుంచి వృద్ధులు కుటుంబ సభ్యుల సహాయంతో బ్యాంక్‌ల వద్దకు చేరుకున్నారు. బ్యాంక్‌ల వద్ద పడిగాపులు కాయడంతో పాటు రానుపోను 200 రూపాయలు ఆటో చార్జీలకు ముట్ట చెప్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమకు సూర్యోదయం కాకముందే పింఛన్ సొమ్ము అందించేవారని, ఇప్పుడు ఇలా బ్యాంక్‌లు చుట్టూ తమను తిప్పి ఇబ్బందలకు గురిచేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.